# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ వారి కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేదీ : 23.10.2018.**

## ఏ.టి.యం కేంద్రాల వద్ద మోసానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

## *రెండు నేరాల్లో రూ.80 వేల చోరీ సొత్తు స్వాధీనం*

ది.08.10.2018న భవానీపురం మరియు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో ఏటిఎం కేంద్రాల వద్ద అయ్యప్ప స్వామి వేషధారణలో కాపుకాసి ఏటిఎం కార్డు పిన్ నంబర్లు మార్పు చేస్తానని చెప్పి, ఇద్దరు ఖాతాదారులను ఏమార్చి వారి ఏటిఎం కార్డుల ద్వారా నగదు డ్రా చేసి మోసానికి పాల్పడిన సోదరబోయిన వెంకటేష్ అనే నిందితుడిని ది.23.10.2018న భవానీపురం పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రెండు నేరాల్లో రూ.80 వేల చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

**<u>నిందితుడి నేర చరిత్ర :</u>**

తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా, మిర్యాలగూడకు చెందిన సోదనబోయిన వెంకటేష్(30) ఆటో డ్రైవర్. జల్సాలకు అలవాటు పడిన నిందితుడు ఆటోపై వచ్చే ఆదాయం జల్సాలకు చాలకపోవడంతో తేలికగా డబ్బు సంపాదించేందుకు ఎ.టి.ఎం.ల వద్దకు వచ్చే వారిని ఎంచుకుని నేరాలు చేయడం ప్రారంభించాడు. నిందితుడు గతంలో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో-2, నల్గొండ జిల్లా సూర్యారావు పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో-5, నకిరకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో-2, చిట్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో-1, రామన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో-1, నార్కెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో-1, గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో -1 నేరాలకు పాల్పడగా అయా కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్ళడం జరిగింది. బెయిల్‌పై బయటకు వచ్చిన వెంకటేష్ విజయవాడ నగరంలోని భవానీపుం మరియు ఇబ్రహీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకే రోజు రెండు నేరాలు చేయడం జరిగింది.

**<u>నగరంలో చేసిన రెండు నేరాల వివరాలు :</u>**

భవానీపురం హెచ్‌బి కాలనీకి చెందిన ఒక మహిళ ది.8.10.18న మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో స్వాతి సెంటర్ వద్ద ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద ఉన్న ఏటిఎం కేంద్రానికి తనకు క్రొత్తగా మంజూరైన ఏటిఎం కార్డు పిన్ నంబరు జనరేట్ చేసుకోవాడనికి వెళ్ళింది. అక్కడ అయ్యప్ప స్వామి మాల వేషదారణలో కాపు కాసిన వెంకటేష్ ఆమెతో మాటలు కలిపి ఏటిఎం పిన్ నంబరును మారుస్తానని ఆమెను నమ్మించాడు. అక్కడ పలు మార్లు బాధితురాలి ఏటిఎం కార్డును మరియు తన ఏటిఎం కార్డును ఏటిఎం యంత్రంలో పెట్టినట్లు నటించి సంబంధిత ఏటిఎం సరిగా పని చేయడంలేదని మరో చోట ప్రయత్నిద్దామని చెప్పి ముందుగా అనుకున్న పథకం ప్రకారం ఆమెను బ్యాంక్ సెంటర్ పెట్రోల్ బంక్ వద్దకు ఎస్‌బిఐ ఏటిఎం కేంద్రానికి తీసుకుని వెళ్ళాడు. అక్కడ పిన్ నంబరు త్వరగా జనరేట్ అవ్వాలంటే ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయాలని ఆమెను నమ్మించి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ చేయించాడు. అనంతరం బాధితురాలి ఏటిఎం కార్డును మరియు నిందితుడికి ఏటిఎం కార్డును పలు మార్లు ఏటిఎం యంత్రంలో పెట్టి బాధితురాలిని ఆయోమయంలో పడేసి రెండు ధఫాలుగు బాధితురాలి ఖాతా నుండి రూ.40 వేలను డ్రా చేయడం జరిగింది. ఇదే తరహాలో వెంకటేష్ తొలుత ఆరోజు ఉదయం 11 గంటలకు ఇబ్రహీంట్నం పోలీస్‌స్టేషన్ పరిధి రింగ్ సెంటర్ వద్ద ఉన్న ఎస్‌బిఐ ఏటిఎం కేంద్రంలో ఒక వ్యక్తిని ఏటిఎం పిన్‌నంబరు జనరేట్ చేస్తానని నమ్మించి పైన పేర్కొన్న విధంగా మోసగించి అతని ఏటిఎం కార్డు ద్వారా రెండు విడతలుగా రూ.40 వేలను తస్కరించడం జరిగింది. వెంకటేష్ నేరాలు చేసిన అనంతరం నీలంరంగు సుజికీ జిక్సర్ ఎస్‌ఎఫ్ మోటారు బైక్‌పై వెళ్ళిపోవడం జరిగింది.

జరిగిన రెండు నేరాల్లో ఇబ్రహీంపట్నం మరియు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లలో బాధితులు ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఏటిఎం కేంద్రాల్లో మరియు సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమేరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రమంలో ది.23.10.2018న నిందితుడి గురించి అందిన సమాచారం మేరకు భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమ్మరిపాలెం సెంటర్ వద్ద గల ఎస్.బి.ఐ, ఏ.టి.యమ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వెంకటేష్‌ను అరెస్ట్ చేయడంతో పాటు, అతని వద్ద నుండి రూ.80 వేల చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగింది.

--xx--